# ఓ (సీ) కథ

సూర్యోదయంకాకముందే స్నానం చేసి సంధ్యా వందనం కార్యక్రమం ముగించుకుని జీర్ణావస్థలో వంటేసున్న ధోవతి మార్చుకుని మాసికవేసిన వుతికిన ధోవతి కట్టుకుని ఏడుగంటలయ్యేసరికి వీధిలోకొచ్చేడు రామశాస్త్రి.

ముఖాన, వంటేన, విభూది పట్టెలు... బక్క చిక్కిన శరీరం మీద అడ్డంగా వ్రేలాడే యజ్ఞోపవీతం... తెల్లగా తోమిన ఇత్తడి చెంబు చెతిలో పుచ్చుకుని చిరు మందహాసంతోయ వీథిన నడిచివెడుతూంటే చూపరులకు చేయెత్తి నమస్కరించాలన్పిస్తుంది. వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిపాస్తులు తనకంటూ ఏమీలేకపోయినా తాతలకాలంనుండీ కాపురముంటున్న ఆ వూరిని వదిలిపోబుద్ధికాలేదు రామశాస్త్రికి.

తాతగారు వేదపండితులు. అంతటి పాండిత్యం తండ్రికి అబ్బకపోయినా పౌరోహిత్యం జరిపిస్తూ పొట్ట పోసుకుని గంపెడు సంసారాన్ని పోషించాడు.

జ్యోతిష్య శాస్త్రంలో ప్రావీణ్యం సంపాదించి... శుభకార్యాలకు ముహూర్తాలు నిర్ణయించి పెడుతూ, వారిచ్చే ఐదో పదో స్వీకరిస్తూ...అదీ చాలక... పస్తులుండటానికి మనస్కరించక ఆయవార వృత్తికూడా చేపట్టడం తప్పనిసరైంది రామశాస్త్రికి.

రోజులు మారుతున్నాయ్... పరిస్థితులు తారుమారవుతున్నాయ్. ఆదరణ...అభిమానం సన్నగిల్లుతోన్నాయి...దానధర్మాలపట్ల చులకన భావం చోటుచేసుకోవటం కళ్ళారా చూస్తూకూడా చేతిలో చెంబుని దూరం చేసుకోలేక పోతున్నాడు.

మరోవృత్తి చేపట్టగల వయస్సు కాదు. పెట్టినా పెట్టకపోయినా- ఆదరించినా చీదరించినా ఒకేవిధంగా బ్రతుకు వెళ్లదీస్తున్నాడు.

రామశాస్త్రికి ముగ్గురు ఆడపిల్లలు... ఇద్దరు మగ సంతానం.

చచ్చీచెడీ ఎలాగో పెద్దపిల్లకు చేశాననిపించుకున్నాడు. అదేవూళ్లో రెడ్డిగారి రైస్‌మిల్లులో అల్లుడికి వుద్యోగం. లెక్కలు వ్రాసిపెడుతూ. చెప్పిన పనల్లా చేస్తూ వారిచ్చింది తీసుకుంటూ బ్రతుకుతున్నాడు.

రెండో పిల్ల గాయత్రి పెళ్ళీడుకొచ్చింది. హైస్కూలు చదువు పూర్తికాగానే కుట్టుమిషను నేర్చుకుంది. అష్టకష్టాలుపడి కూతురికో కుట్టుమిషను కొనిపెట్టగలిగేడు.

నోటి మంచితనంతో ఇరుగుపొరుగు ఆడవాళ్ళు జాకెట్లు కుట్టి...పిల్లలు లంగాలు కుట్టి, నెలకు యాభయ్యో, అరవయ్యో ఆర్జిస్తూ తండ్రికి కొండంత అండగా వుండగలుగుతోంది గాయత్రి.

మూడోపిల్ల సావిత్రి పన్నెండేళ్ళు. ఆఖరుదానికి ఎనిమిదేళ్ళు.

శాస్త్రి చిన్నతనంలో ఆ వూళ్లో ఎలిమెంటరీ స్కూలు మాత్రమే వుండేది. కాలక్రమేణా అక్కడొక హైస్కూలు... ఆ తర్వాత జూనియర్ కాలేజీ... ఇప్పుడు డిగ్రీ కాలేజీ వెలిశాయి.

పెద్ద కొడుకు రాంబాబు ఇంటర్ మంచి మార్కులతోనే పాసయ్యాడు. కొడుక్కి వారాలు కుదిర్చాడు శాస్త్రి.

డిగ్రీలోకి అడుగుపెట్టబోతాడనగానే రాంబాబులో అభిమానం పెచ్చు పెరిగింది. వారాలు చేసుకుని పరాయి ఇంట భోజనం చేయటం నామోషీగా తోచింది. ఆ విషయం తెలుసుకున్న శాస్త్రి కొడుకుని చీవాట్లు పెట్టేడు. అయినా ససేమిరా వప్పుకోలేదు రాంబాబు.

బి.యస్సీ డిగ్రీలో సీటు వస్తుందో లేదోనని శంకతో బి.ఎ., బి. కాం., గ్రూపులకూ్కడా అప్లికేషన్లు వేయటం తప్పనిసరైంది.

రాంబాబు ఊహించినట్లే జరిగింది!

బి.ఏ.లో ఎడ్మిషనుకు మాత్రమే ఇంటర్వ్యూ కార్డొచ్చింది. ఇంటర్‌దాకా సైన్సు గ్రూప్ చదివి, తీరా డిగ్రీ, ఆర్ట్సు గ్రూప్ చదవాలంటే మనస్కరించలేదు రాంబాబుకి. ఆ విషయమే తండ్రితో ప్రస్తావించేడు.

కొడుకు మాట కాదన్లేక, ప్రిన్స్‌పాల్ తెల్సినవాడు కావటంతో బి.యస్సీలో సీటిమ్మని ప్రార్థించేటందుకై రామశాస్త్రి బయల్దేరేడు.

రామశాస్త్రిని చూడగానే సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి "చూడండి శాస్త్రిగారూ!- ఎవరి అభిరుచి మేరకు వారు చదువుకోవాలనే రోజులు కావివి!- ఎంచేతంటారా?... ఇప్పుడన్నీ రూల్సు... రిజర్వేషన్లు!!- వీటికి భిన్నంగా పోనీలెమ్మని మీవంటివారికి సాయపడ్డానే అనుకోకండి - వెంటనే నామీద పిటీషన్లు పైకిపోతాయ్. ఎంక్వయిరీలు జరుగుతాయ్. కమిటీ వచ్చి రికార్డు పరిశీలిస్తుంది. ఆ తర్వాత నా వుద్యోగం వూడుతుంది! సీట్లు కేటాయింపు విషయంలో స్వేచ్ఛ ఎక్కడేడ్చిందండీ నాకు?!- ఆ రోజులెప్పుడో పోయాయి! - నందో రాజా భవిష్యతి!! - మీ వాడు

'ఓసీ' కావడమే దౌర్భాగ్యం. యాభై శాతం పైగా మార్కులొచ్చిన మీ వాడికి సీటివ్వకుండా... నలభై శాతం అత్తెసరుమార్కులతో పాసైన మరొకడికి ఇవ్వాల్సొస్తుంది. అదీ రూలు!- బి.యస్సీలోనే సీటు కావాలని భీష్మించుక్కూర్చుంటే లాభంలేదు. ఎందులో సీటోస్తే చచ్చినట్టు అదే గ్రూపులో చేరి చదవాలి!! అర్థమైందా?యింతకుమించి నేనేమీ చెప్పలేను'' గడగడా మాట్లాడేడు ప్రిన్సిపాల్.

ఆ మాటలు విన్న రామశాస్త్రి అవాక్కయిపోయేడు. నోరుమెదపలేక పోయాడు. శలవు తీసుకుని ఇంటిదారి పట్టేడు.

బి.ఏ.లో చేరిన రాంబాబుకి అంతా అయోమయంగా తోచింది. సబ్జెక్ట్సు అర్థంకావటంలేదు. చదివిన సైన్సుగ్రూపుకి చదవనున్న ఆర్ట్సుగ్రూపుకీ ఎక్కడా పొంతన కుదరటంలేదు.

లెక్చరర్లు పాఠాలేమో క్లాసులో సరిగ్గా చెప్పరు-చెప్పినా బుర్రకెక్కడం లేదు - పోనీ ట్యూషన్ చెప్పించుకుందామా అంటే... లెక్చరర్లు టూషన్లు చెప్పకూడదనే ప్రభుత్వపు ఆంక్ష మరోవేపు.

★★ ★★ ★★

చౌదరిగారి పాలేరొచ్చి రామశాస్త్రిని వున్నఫళంగా వెంటబెట్టుకుని తీసుకు రమ్మనే కబురు చెప్పేడు.

వంటిన కండువా వేసుకుని గబగబా చౌదరి ఇల్లు చేరుకున్నాడు, శాస్త్రి.

''రావయ్యా శాస్తుర్లూ... రా!-నీతో పనిబడ్డది.'' హాల్లో వున్న సోఫాలో కూర్చుని స్వాగతం పలికాడు చౌదరి.

''తమవంటి లక్ష్మీపుత్రులకు నావంటి బీదవాడితో పని పడటం... అది నా అదృష్టంగానే భావిస్తాను.''

అట్టా సోఫాలో కూర్చో! - చూడూ!! మనూరికి మంత్రిగారిని రప్పిస్తున్నాను. నేను ఎం.ఎల్.ఏగా పోటీచేసి ఓడిపోయినా, ఈ మంత్రిగారు నాకు కావలిసిన మడిసి. నా మాట కాదనడు. అందుకే రప్పిస్తున్నాను...''

ఏ మంత్రిగారొచ్చినా తనకేమీ ఒరిగేది లేదనే భావంతో నిర్లిప్తంగా చౌదరి ముఖంలోకి చూశాడు శాస్త్రి.

''అసలువిషయం ఏమిటంటే... నేను కట్టబోయే నూలుమిల్లుకి మంత్రిగారి చేత శంకుస్థాపన చేయించదలుచుకున్నా! ఎట్టాగూ ఇంతదూరం వస్తున్నాడు కాబట్టి...అదే-మనూరి చివర గుడిసెల్లో వుంటున్నోళ్లకీ భూమి పట్టాలిప్పిద్దా

మనుకుంటూన్నా. కలెక్టరికీ విషయం ముందుగానే చెప్పానే!...'' అంటూ స్పెన్సర్ చుట్ట వెలిగించేడు.

చౌదరిమాటల్లో ఏదో కొత్తదనం... చేపట్టనున్న కార్యక్రమంలో ఏదో నూతనత్వం ప్రస్ఫుటమైనట్టు తోచింది శాస్త్రికి. పిల్లికి బిచ్చం పెట్టని చౌదరి... పేదలకు ఇళ్ల స్థలాలు పంచిపెట్టడమా... ఏమిటీ విడ్డూరం అనిపించింది మరోవేపు.

చుట్టపొగ గుప్పుగుప్పున వదుల్తూ అదోలా నవ్వి ''పట్టాలిప్పిస్తున్నానంటే పళ్ళికిలించుకుంటూ క్యూలో నిలబడతారు ఎదవలు. మంత్రిగారు అటెళ్ళి పోగానే... అళ్ళకు పీకలదాకా సారా పోయించి, పాతికో పరకో చేతిలో పెట్టి మళ్ళా భూమంతా నాపేర రాయించుకుంటానయ్యా. అదంతా ఓ సీక్రెట్టు... నీకెందుగ్గానీ...'' చెప్తూ మధ్యలో ఆపేశాడు, చౌదరి.

చౌదరి బుద్ధి, మనస్తత్వం వూళ్ళో అందరికీ తెల్సు! వట్టి డబ్బుమనిషి! ఎన్నికల ప్రచారం కోసం పార్టీవాళ్ళు పది లక్షలిస్తే... కనీసం లక్షయినా ఖర్చుపెట్టకుండా మిగతాడబ్బంతా బ్యాంకులో వేసుకున్నాడు. ఎవరికి తెలియనిది ఈయనగారి బాగోతం అనుకున్నాడు శాస్త్రి మనసులోనే.

''అదిసరే పంతులూ!... నిన్ను పిలిపించిది ఎందుకో తెలుసా? పంచాంగం చూసి శంకుస్థాపనకు ముహూర్తం పెట్టాల! పూజా పునస్కారం నువ్వే చెయ్యాలి ఆ రోజున! నీ కట్టం వుంచకోన్లే. పైగా... మంత్రిగారికి తీసేఫోటోల్లో నువ్వూ అగుపడేట్టు చూస్తాను...''

''ఫోటోలో వున్నంతమాత్రన నా కడుపు నిండేదేముందండీ? కార్యక్రమం ఘనంగా తలపెట్టారు. అయ్యా...మరి...నా తాంబూలం విషయం కూడా...''

''ఘనంగానే ఇస్తాలేవయ్యా - ఇదిగో చూడు. నీ రేటు పదిరూపాయలైతే మరో ఐదు ఎక్కువే ఇస్తాలే! మంత్రాలు మాత్రం గడగడా గంటకొట్టినట్టు చెప్పాల! మంత్రిగారు గుమ్మైపోవాల...''

''చౌదరిగారూ! కేవలం నేను ఇటువంటి కార్యాలమీద ఆధారపడి బ్రతుకుతున్నవాడిని. తమకు తెలియనిదేముంది? ఇటువంటప్పుడైనా తమరు నూట పదహార్లు, జరీ అంచు పంచలచాపు ఇప్పించకపోతే ఎట్లా?...''

''అమ్మో!.. ఆశ శానాదాకావుందే పంతులూ! అందుకేనయ్యా నీలాంటోళ్ళు పైకి రాలేక నలిగి సత్తావుండారు. సర్లే! ఆ విషయం నాకొదిలెయ్...''

ఆ మాట విన్న శాస్త్రి మనసు చివుక్కుమంది. బాధపడ్డాడు. తన లేనితనాన్ని ఎంత చులకన చేసి మాట్లాడేడు? 'తప్పు అతనిదికాదు... అతని వెనక ఉండే డబ్బు అహంకారంది' అనుకొని సరిపెట్టుకున్నాడు.

''అలాగే... తమరు చెప్పినవిధంగానే పంచాంగం చూసి మంచి ముహూర్తం నిర్ణయించి, తమతో మళ్ళీ వచ్చి చెబుతాను...'' అనేసి కూర్చున్నవాడల్లా లేచి ఇంటిముఖం పట్టేడు శాస్త్రి.

★★ ★★ ★★

మంత్రిగారు...జిల్లా కలెక్టరు...పోలీసు అధికారులు...అనధికారులు... వారితాలూకు కార్లు... జీపులు...ఫోటోగ్రాఫర్లు అంతా ముహూర్తం టైముకి చేరుకున్నారు.

శాస్త్రి మనసు ఆనందంతో పరవశించిపోతోంది. మనిషిహుషారుగా వున్నాడు.

మంత్రిగారు శంకుస్థాపన కార్యక్రమం ఆరంభించగానే... గాత్రం పెద్దదిచేసి మంత్రోచ్చారణకు ఉపక్రమించాడు శాస్త్రి.

శాస్త్రినైపుణ్యానికి, సమయస్ఫూర్తికి మెచ్చుకోలుగా చిరుమందహాస వదనంతో అతగాడి ముఖంలోకి పదే పదేచూశారు మంత్రిగారు.

తదుపరి కార్యక్రమం కోసమై కార్లో మరో చోటికి బయల్దేరారు మంత్రివరేణ్యులు.

ఊరికి దూరంగా వున్న గుడిసెల పక్కగా వేసిన షామియానా దగ్గరకొచ్చి ఆగింది కారు.

ఠీవిగా కారు దిగి... దర్జాగా వచ్చి వేదికనలంకరించేరు మంత్రిగారు. వారి పక్కగా జిల్లా కలెక్టరు తదితరులు ఆసీనులయ్యారు.

షామియానాకి ఎదురుగా జనం వరుసగా కూర్చున్నారు.

లేని నవ్వు తెచ్చి పెట్టుకుంటూ... ఆప్యాయత ఒలకపోస్తూ ఒక్కొక్కరినీచూస్తూ (మళ్ళీ ఓటుకోసం) పదేపదే నమస్కరిస్తూ...మాటలతో చమత్కరిస్తూ ఇళ్ళ స్థలాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించేరు మంత్రిగారు.

బీదాబిక్కి, వారితోపాటు బక్కచిక్కిన శాస్త్రికూడా పట్టాకోసం క్యూలో నిలబడ్డాడు.

లిస్టులో తనపేరు లేకపోయినా...తనను ఎవ్వరూ పిలవకపోయినా క్యూలో వచ్చిన శాస్త్రి మంత్రిగారి ముందుకొచ్చి నిల్చొని నమస్కరించి చెయ్యి చాచేడు.

మంత్రిగారుమొదట్లో ఖంగుతిన్నా, విషయం గ్రహించి '' ఇదిపండితసత్కార కార్యక్రమం కాదు గదా...మరి మీరెందుకొచ్చినట్టు...?'' అని ప్రశ్నించేరు శాస్త్రి ముఖంలోకి ఫోజు పెట్టి చూస్తూ.

''అయ్యా! తమరు క్షమించాలి. తమరు పట్టాలిస్తున్నవారికి, నాకు తేడాలేదు...'' వినయంగా చెప్పేడు శాస్త్రి.

''వారు బీదా బిక్కా...పైగా వెనకబడినవారు...'' మంత్రిగారు నచ్చచెప్పబోయాడు.

''అయ్యా!... నేనూ బీదవాడినే! ఆర్థికంగా వెనకబడినవాడిని. కనికరించి భూదానం చేయండి నాకు. తమరికి పుణ్యం ఉంటుంది...'' అర్థించాడు శాస్త్రి.

''నువ్వు అగ్రవర్ణం వాడివి! వీరంతా దేశానిక్కావలసిన వాళ్ళు! - వీళ్ళని మేము ప్రత్యేకంగా వుద్ధరించాలి!! అర్థమైందా...తమరిక్కడ్నించి తక్షణం వెళ్ళిపొండి...'' చిరుకోపం ధ్వనించింది మంత్రిగారి మాటల్లో.

పోలీసులొచ్చి శాస్త్రిని పక్కకు ఈడ్చుకెళ్ళేరు.

శాస్త్రి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

★★ ★★ ★★

''నాన్నా...నాన్నా!...నన్ను ఇంటర్వ్యూకి రమ్మని కాల్‌లెటరొచ్చింది...'' సంబరపడిపోతూ ఇంట్లోవున్న తండ్రినుద్దేశించి కేకేసి మరీ చెప్పేడు రాంబాబు.

'' ఇంటర్వ్యూకి రమ్మన్నారా... అంతేకదా?!... ఇంతమాత్రానికే అంత పొంగిపోతావేమిట్రా... ఏదో వుద్యోగమే వచ్చేసినట్లూ...'' విరిగిపోయిన కంటి జోడుని దారంతో కట్టి కంటికి తగిలించుకునివస్తూ బదులుపలికేడు శాస్త్రి.

''ఈసారి ఈ వుద్యోగం తప్పకుండా వస్తుంది నాన్నా!...''

''ఈమాట నీ నోటి వెంట వినడం నేనది నూరవసారి - వినివినీ... నీకు వుద్యోగం వస్తుందన్న ఆశ కూడా నాలో అణగారిపోయిందిరా!''

''నన్ను మాత్రం ఏమి చేమంటావు నాన్నా?! కష్టపడి ప్రిపేరైపోతూనే వున్నా...''

''నామాటవిని... ఇకనుంచీ నువ్వీ ఉద్యోగ ప్రయత్నం మాని... హాయిగా ఏ చెప్పులు కుట్టడమో...తలగొరగడమో నేర్చుకో! వృత్తి విద్యతో పొట్టపోసుకోవచ్చు...''

''ఏమిటండీ ఆ మాటలు?...రానురానూ మీకు మతికూడా పోతున్నట్టుంది ఖర్మ...'' భర్తను వారించింది సీతమ్మ.

''మాటలుకాదే...కడుపుమంట! ఈ విధంగా వీడు ఇంటర్వ్యూలకు వెళ్లీ వెళ్ళీ తలనెరిసి పోతుంది. పళ్ళూడిపోతాయ్ - వుద్యోగంమాత్రం వీడికీజన్మకి రాదు. అసలు..నాకడుపున పుట్టడమే వీడు చేసుకున్న దురదృష్టం! హాయిగా ఏ ముష్టెత్తుకునేవాడి కడుపునైనా పుట్టివుంటే బావుండి వుండేది...''

''నువ్వు చేస్తున్న పని అదే నాన్నా! నా దృష్టిలో యాచనకు- ముష్టికి తేడాలేదు...'' ఆవేశంగా అన్నాడు రాంబాబు.

''రాంబాబూ! నీ తెలివికి సంతోషించానుగాని, ఇక నోర్మూయ్...'' ంతో వూగిపోయాడు శాస్త్రి.

'' మీరేమన్నా నాకు బాధలేదు. మన పరిస్థితి మారాలి అంటే...నాకు వుద్యోగం కావాలి! అందుకోసం నాకిప్పుడు రెండు వందలైనా కావాలి...''

''రెండువందలా?...'' కోడిగుడ్డు ఆకారంలో నోరు తెరిచి నిశ్చేష్టురాలైంది సీతమ్మ.

''అవునమ్మా! హైద్రాబాదు పోయిరావటమంటే మాటలా? ప్రయాణ చార్జీకే వందరూపాయలైపోతాయ్...''

''అవునువురి... దూరాభారంకాదా... అంతడబ్బుకావాలివురి...'' తలూపుతూ గొణిగింది సీతమ్మ.

''అన్నయ్యా!... నాన్నని డబ్బుకోసం వేధించకు. నేను గుడ్డలుకుట్టి దాచుకున్న డబ్బు నీకెలాగో సర్దుతానులే...'' కుట్టుమిషను ముందుమంచి లేచి వస్తూ ప్రామిస్ చేసింది గాయత్రి.

★★ ★★ ★★

రాంబాబు రైల్లో హైద్రాబాద్ చేరుకున్నాడు. సరాసరి ట్రైన్ దిగగానే ఇంటర్వ్యూ స్థలం వెతుక్కుంటూ చేరుకున్నాడు.

ఆఫీసు చుట్టూ వున్న విశాలమైన స్థలంలో అప్పటికే వేల సంఖ్యలో వచ్చిన అభ్యర్థులు గమిగూడివుండటం చూశాడు రాంబాబు. మనిషిలో ఆశ నీరుగారిపోయింది.

ఇసుకేస్తే రాలని జనంతో ఆ ప్రదేశం కిటకిట లాడిపోతోంది. ఉద్యోగాల సంఖ్య ఎనభై! వచ్చినవాళ్ళు వేలమందున్నారు.

హే భగవాన్! - ఇంతమందికి ఒక్కరోజులో ఇంటర్వ్యూ ఎలా జరుపుతారో బోధపడ్లేదు రాంబాబుకి! వచ్చినవారందరినీ ఇంటర్వ్యూ జరపాలంటే కనీసం పదిరోజులపైగా పడుతుందన్పించింది.

తానుమరి... హైద్రాబాద్‌లో ఇన్నాళ్లు ఎలావుండటం? తనదగ్గర అంత డబ్బేది? పోనీ... తెల్సినవారో... బంధువులో లేకపోయిరి!

ఉదయం ఎనిమిది గంటలకల్లా హాజరుకమ్మని తీరా పదిగంటలు దాటుతున్నా

ఇంటర్వ్యూ తంతు ప్రారంభం కాకపోవటంతో అక్కడకొచ్చినవారిలో కలకలం బయల్దేరింది.

కొందరిలో నిరుత్సాహం... మరికొంతమందిలో అశక్తత... చాలామందిలో ఆవేశం క్రమేపీ చోటు చేసుకోనారంభించాయి.

వేల సంఖ్యలో వచ్చిన అభ్యర్థులను అదుపులో పెట్టడం డిపార్ట్‌మెంట్‌వారికో సమస్యయి కూర్చుంది.

అసలు విషయమేమిటని చెప్పగలవారే కరువయ్యారు.

ఎండ నెత్తి మాడుస్తోంది. మచ్చినవారిలో సహనం సన్నగిల్లింది.

విసుగుతో... ఆక్రోశంతో తలా ఒకరకంగా కేకలేయ నారంభించారు.

అకస్మాత్తుగా కలకలం చెలరేగింది. ఆఫీసుపైరాళ్ళు రువ్వేరు. నోటికొచ్చి నట్లల్లా బండబూతులు తిట్టారు రెచ్చిపోయి.

గుంపును అదుపు చేసేటందుకై పోలీసులు లాఠీలు ఝుళిపించారు.

ఇంటర్వ్యూ జరగాల్సిన ప్రదేశం రణభూమిగా మారింది.

కేకలు... అరుపులు... హాహాకారాలు... లాఠీదెబ్బలు తప్పించుకోవాలని దిక్కుతోచకండా పరుగెత్తసాగేరు.

రాంబాబు పిచ్చెక్కినవాడిలా అగమ్యంగా పరుగెత్తసాగేడు.

ఒక లాఠీదెబ్బ వీపుమీద...మరో దెబ్బ కాలిమీద బలంగా పడ్డాయి... మనిషి కుప్పకూలిపోయేడు.

శక్తిని కూడదీసుకుంటూ పడుతూ లేస్తూ వగరుస్తూ దఃఖిస్తూ... రోడ్డుమీదికొచ్చి సొమ్మసిల్లి పడిపోయాడు.

ఓ రిక్షావాడు జాలిపడి రాంబాబుని రిక్షాలో వేసుకుని ప్రభుత్వాసుపత్రికి చేర్చాడు.

రాంబాబుని చేతులమీద వేసుకుని క్యాజువాలిటీలోకి తీసుకెళ్ళి పడుకోబెట్టి డాక్టర్లకు పరిస్థితి వివరించాడు.

క్యాజువాలిటీలోంచివెంటనే రాంబాబుని ఆపరేషన్ థియేటర్‌కి తరలించారు డాక్టర్లు.

★★ ★★ ★★

రాంబాబుకి స్పృహవచ్చి కళ్ళు తెరవగలిగిచూచేసరికి ఎదురుగా తల్లీ తండ్రీ వున్నారు.

కొడుకు పరిస్థితి కళ్లారా చూస్తూ కలవరపడ్డారు. తన శరీరాన్ని ఆసాంతం చూసుకున్నాడు రాంబాబు. ఎడమకాలు మోకాలి క్రిందభాగం బోసిగా వుంది. అంటే...డ్యాక్టర్లు... తన కాలు తీసేశారా?...తాను కుంటివాడా?...బాధతో కృంగి పోయాడు.

''ఉద్యోగమంటూ ఇంతదూరం వచ్చి అవిటితనం కొనితెచ్చుకున్నావా బాబూ?...'' తండ్రిలో దఃఖం పెల్లుబికింది.

గుండెలవిసేలా రోదించింది తల్లి!

రాంబాబు తననుతాను సంబాళించుకుంటూ ''బాధపడకండి నాన్నా!... నాకిప్పుడెంతో సంతోషంగా వుంది-ఎందుకో తెలుసా? నాకు ఉద్యోగం ఇక తప్పకుండా వస్తుంది! - ఐతే... ఓపెన్ కాంపిటీషన్లో మాత్రం కాదు-ఫిజికల్లీ హేండీకాప్డ్ కోటాలో... ఈ కుంటితనం భగవంతుడు నాకు ప్రసాదించిన వరమౌతుంది నాన్నా!... వరమే అవుతుంది!...'' చెప్పి బావురుమన్నాడు.

---

★ *(2-7-1987 ఉదయం వార పత్రికలో ప్రచురితం)*

*With best compliments from*

Ph : 7673047

**VIJAY CREATIONS**

EXPERTS IN STILL PHOTOGRAPHY

MULTIMEDIA & D.T.P.

**<u>SPECIALISTS IN</u>**

PHOTO ALBUM DESIGNING

H.No. 1-8-499/17-1,
Venkateshwara Temple Kaman,
Chikkadapally, Hyd - 500 020.